సాక్షి
కుమురం భీం
ఆదివారం । 17 । ఆగస్టు । 2025



ముగిసిన తీజ్ సంబురం
తొమ్మిదిరోజులు కొనసాగిన తీజ్ వేడుకలు ముగిశాయి. పెళ్లికాని యువతులు జగదాంబ ఆలయానికి వెళ్లి నైవేద్యాలు సమర్పించి భారీ ఊరేగింపు నిర్వహించారు. 9లో▸



ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రామగ్రామాన ఉట్టి వేడుకలు నిర్వహించగా చిన్నాపెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
29.0 /24.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

వాన.. వరదగా..

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- పలు చోట్ల నిలిచిన రాకపోకలు
- నీట మునిగిన పంట పొలాలు
- అడ ప్రాజెక్ట్ ఆరు గేట్లు ఎత్తివేత
- వట్టివాగు ప్రాజెక్ట్ నాలుగు గేట్లూ..
- పలు సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



తిర్యాణి మండలం మాణిక్యపూర్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వాగునీటి నుంచి దాటుతున్న ప్రజలు

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్/దహెగాం/పెంచికల్‌పేట్/తిర్యాణి/కాగజ్‌నగర్ టౌన్/కాగజ్‌నగర్ రూరల్/రెబ్బెన/కెరమెరి: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుమురంభీం (అడ), వట్టివాగు ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరింది. ఆసిఫాబాద్ మండలంలోని గుండి, తుంపెల్లి, అప్పపల్లి వాగులు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయమై పలు ఇళ్లలోకి వరదనీరు చేరింది.

అయా మండలాల్లో..
దహెగాం మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లలోకి వరదనీరు చేరింది. ఐనం గ్రామ సమీపంలోని కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో రెండు లోలెవల్ వంతెనల పైనుంచి వరదనీరు వెళ్తుండగా రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రం నుంచి కల్వాడ వైపు వెళ్లే మార్గంలో లోలెవల్ వంతెనపై వరద పారడంతో అటువైపు వెళ్లేవారు హత్తిని మీదుగా ప్రయాణించారు. మల్లన్న ఒర్రె ఉప్పొంగడంతో సమ్మక్క గద్దెల వద్ద నుంచి వరద పారింది. సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా దహెగాంతోపాటు ఐనం, పెసరికుంట గ్రామాలను సందర్శించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈమె వెంట తహసీల్దార్ మునవార్ షరీఫ్, ఎంపీడీవో రాజేందర్, పంచాయతీ కార్యదర్శులు రాజేశ్, ప్రణీత్‌బాబు ఉన్నారు. పెంచికల్‌పేట్ మండలంలోని పెద్దవాగు, ఉష్కమల్లవాగు, ఒర్రెలు పొంగి ప్రవహిస్తున్నాయి. కొత్తగూడ, పెంచికల్‌పేట్ గ్రామాల్లో పలువురి ఇళ్లలోకి వరద నీరు చేరింది. పెంచికల్‌పేట్–సలుగుపల్లి, గుండెపల్లి–కమ్మర్‌గాం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. లింగాపూర్ మండలంలోని వాగులు, ఒర్రెలు ఉప్పొంగాయి. వంతెనలపై వరదనీరు ప్రవహించడంతో పిట్టగూడా, మోతీపటార్, గుమ్నూర్, కంచన్‌పల్లి, ఫూల్‌సింగ్‌తండా, చోర్‌పల్లి, నాగుగూడా, కీమానాయక్‌తండా, పట్కల్‌మంగి గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. తిర్యాణి మండలంలోని మాణిక్యపూర్ నుంచి మంగి గ్రామానికి వెళ్లే దారిలోగల బ్రిడ్జిపై వాగునీరు ప్రవహించడంతో రెండు గంటల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెలిమల ప్రాజెక్ట్ అలుగు పారి జలపాతాన్ని తలపించగా స్థానికులు ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. ద్వారకానగర్, సంజీవయ్య కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, తొమ్మిదోవార్డు, కాపువాడ తదితర ప్రాంతాలను వరదనీరు ముంచెత్తింది. ఆర్‌ఆర్‌వో కాలనీలోని కేజీబీవీ, ఎస్సీ హాస్టల్ ఆవరణలో వరదనీరు చేరగా విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి సజీవన్ హాస్టల్‌కు చేరుకుని పరిస్థితిని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ దృష్టికి తీసుకువెళ్లారు. కమిషనర్ స్పందించి వరద నీటిని బయటకు పంపించారు. రెబ్బెన మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో పలువురు ఇళ్లలోకి వరదనీరు చేరింది. కాలనీని ఆర్‌ఐ సౌమ్య, పంచాయతీ అధికారులు పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. కాలనీకి ఎగువ నుంచి వరదనీరు వస్తున్న ప్రదేశాన్ని తహసీల్దార్ సూర్యప్రకాశ్ పరిశీలించి మళ్లింపు చర్యలు చేపట్టారు. గంగాపూర్, పులికుంట, పెద్దవాగులు ఉప్పొంగి ప్రవహించాయి. నంబాల బ్రిడ్జి పైనుంచి వరదనీరు ప్రవహించడంతో నంబాల వైపు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. ఎస్సై చంద్రశేఖర్ నంబాల బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిపివేశారు. ఖైరిగూర ఓసీపీలో ఉత్పత్తి నిలిచిపోయింది. కాగజ్‌నగర్ మండలంలోని రాస్పెల్లి, మెట్‌పల్లి, గజ్జిగూడ, మోసం, కోయవాగు తదితర వాగులు ఉప్పొంగాయి. పెంచికల్‌పేట్–కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో ఈజ్‌గాం వద్ద రోడ్డుపై నీరు ప్రవహించగా వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఈజ్‌గాం చౌరస్తా, ఎస్సీ కాలనీలో పలు ఇళ్లలోకి నీరు చేరింది. మెట్‌పల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సందర్శించి వంతెన పైనుంచి రాకపోకలు నిలిపివేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ రామానుజం, రూరల్ ఎస్సై కుమారస్వామి ఉన్నారు. కెరమెరి మండలంలోని కర్సెతగూడ వంతెన పూర్తిగా నీటి మునిగింది. లక్మాపూర్, అనార్‌పల్లి, వాగులు నిండుగా ప్రవహిస్తున్నాయి. వాగు అవతలి గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 15 గ్రామాల ప్రజలు వాగు దాటి రాలేకపోతున్నారు. చాలాకాలం తర్వాత కెరమెరి, సాంగ్వి, గోయగాం వాగులు పొంగిపొర్లాయి. సాంగ్వి, రాంపూర్, ఇంద్రానగర్, కెలికే కల్వర్టు పైనుంచి వరదనీరు ప్రవహించడంతో అనేక గ్రామాల ప్రజలు ఎక్కడికక్కడే నిలిచిపోయారు. వాగు పరీవాహక ప్రాంతంలో 50 ఎకరాల వరకు పంట పొలాలు నీట మునిగాయి.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



తుంపెల్లి వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్

వాతావరణశాఖ సూచన మేరకు భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. ఆసిఫాబాద్ మండలంలోని తుంపెల్లి, రాజురా గ్రామాల్లోని లోలెవల్ వంతెనలను అదనపు కలెక్టర్ డేవిడ్, డీపీవో భిక్షపతిగౌడ్‌తో కలిసి పరిశీలించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. రాజురా లోలెవల్ వంతెన ఇరువైపులా కోతకు గురి కాగా మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. తక్షణ సహాయం, పునరావాస కేంద్రాల సమాచారం కోసం 8500844365 లేదా 100 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



కాగజ్‌నగర్ మండలం మెట్‌పల్లి వద్ద వాగు ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్



కాగజ్‌నగర్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ముందు రోడ్డుపై భారీగా నిలిచిన నీరు

మండలాలవారీగా వర్షపాతం నమోదు ఇలా..

జిల్లాలో అత్యధికంగా కౌటాల మండలంలో 65.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా కాగజ్‌నగర్‌లో 7.8 మి.మీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 25.9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. తిర్యాణిలో 27.8 మి.మీ, ఆసిఫాబాద్‌లో 30.8, రెబ్బెనలో 8, జైనూర్‌లో 16.4, సిర్పూర్ (యు)లో 15.6, లింగాపూర్‌లో 30.8, కెరమెరి 16.2, వాంకిడిలో 10.8, సిర్పూర్ (టీ)లో 16.8, చింతలమానెపల్లిలో 29.2, పెంచికల్‌పేట్‌లో 40.4, బెజ్జూర్ 47.2, దహెగాం మండలంలో 25.2 మి.మీ వర్షం కురిసింది.

ప్రాజెక్టులకు భారీగా వరదనీరు

ఎగువ నుంచి వరదనీరు భారీగా చేరుతుండగా కుమురంభీం (అడ) ప్రాజెక్ట్ ఆరు గేట్లు ఎత్తి 52,100 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ సామర్థ్యం 10.393 టీఎంసీలు (234 మీటర్లు) కాగా, ప్రస్తుతం 5.968 టీఎంసీలుగా ఉంది. 52,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ఆరు గేట్లు ఎత్తి దిగువకు అంతే మొత్తంలో వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్ట్ నాలుగు గేట్లు ఎత్తి 10,830 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపిస్తున్నారు. ప్రాజెక్ట్ సామర్థ్యం 2.890 టీఎంసీలు (238.75 మీటర్లు) కాగా, ప్రస్తుతం 2.579 టీఎంసీలుగా ఉంది. 9,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా నాలుగు గేట్లు ఎత్తి 10,830 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో గుండి, ఆసిఫాబాద్ వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దిగువన గల గుండి, రాజుర, రహపల్లి, చోర్‌పల్లి, చిలాటిగూడ, ఆసిఫాబాద్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపల వేటకు పోవద్దని అధికారులు సూచించారు.



అడ ప్రాజెక్ట్ గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు



'వట్టివాగు' గేట్ల నుంచి..



దహెగాం: వరదను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా



రెబ్బెన: నంబాల బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న నీరు



లింగాపూర్: పిట్టగూడా సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



పెంచికల్‌పేట్: గుండెపల్లి వద్ద రోడ్డుపై పెద్దవాగు బ్యాక్ వాటర్



మోతుగూడలో నీటమునిగిన పంట పొలాలు

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి అండర్–15 వాలీబాల్ పోటీలకు 16మంది విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి వెంకటేశం, కోచ్ రాకేశ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర పోస్ట్‌మెట్రిక్ వసతిగృహం మైదానంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. స్కూల్ గేమ్స్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 30 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఎనిమిది మంది బాలికలు, ఎనిమిది మంది బాలురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈ నెల 18, 19తేదీల్లో రంగారెడ్డిలోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

రోడ్డు వేయాలని ఆందోళన

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని అందవెల్లి–భట్టుపల్లి గ్రామాల మధ్య రోడ్డు వేయాలని శనివారం గ్రామస్తులు ఆందోళన చేశారు. రహదారికి అడ్డంగా ముళ్లకంచెలు ఉంచి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. రోడ్డు బురదమయమై నడిచి వెళ్లలేని పరిస్థితి ఉందని తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నామమాత్రపు చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. కాగా, వీరి ఆందోళనతో దహెగాం–కాగజ్‌నగర్ మార్గంలో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కాగజ్‌నగర్ రూరల్, పట్టణ సీఐలు కుమారస్వామి, ప్రేంకుమార్, ఎంపీడీవో ప్రసాద్ ఆందోళన వద్దకు చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. శాశ్వత పరిష్కారం కల్పించే దాకా నిరసన కొనసాగిస్తామని, అధికారులు స్పందించి పేరుకుపోయిన బురద తొలగించాలని, తాత్కాలిక రోడ్డు వేయాలని కోరారు.

ద్విచక్రవాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో సిబ్బంది

రెబ్బెన: సింగరేణి ఆస్తులున్న ప్రదేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వ్యక్తులు ఎస్‌అండ్‌పీసీ సిబ్బందిని చూసి పరారవడంతో వారి ద్విచక్రవాహనాలను బెల్లంపల్లి ఏరియా ఎస్‌అండ్‌పీసీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌అండ్‌పీసీ ఇన్‌చార్జి శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 13న మధ్యాహ్నం ఏరియాలోని గోలేటి–1ఏ ఇంక్లైన్ ఆవరణలోకి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మూడు ద్విచక్ర వాహనాలపై అక్రమంగా ప్రవేశించారు. మద్యం తాగుతూ చోరీకి పాల్పడే అవకాశమున్నట్లు అనుమానించిన ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది వెంటనే మొబైల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది అక్కడికి వెళ్లడాన్ని చూసిన అనుమానితులు వారి వెంట తీసుకువచ్చిన ద్విచక్రవాహనాలు అక్కడే వదిలేసి పారిపోయారు. అనుమానితుల ద్విచక్రవాహనాలను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని ఎస్‌అండ్‌పీసీ ఇన్‌చార్జి అభినందించారు.

కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ కాంతిలాల్‌పాటిల్

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ కాంతిలాల్‌పాటిల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, ఆయుధాల భద్రత, కేసుల వివరాలు పరిశీలించారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రామానుజం, సీఐ ప్రేంకుమార్, సిబ్బంది ఉన్నారు.

పింఛన్లు పెంచాలని డిమాండ్



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పింఛన్లను పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గుండ థామస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కౌటాల జగదాంబ గార్డెన్ పింఛన్‌దారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించడంతో పూర్తిగా విఫలమైనట్లు ఆరోపించారు. ఈ నెల 21న కౌటాలలో తలపెట్టిన పింఛన్‌దారుల సభలో అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు పిట్టల సత్యనారాయణ, విఠల్, రాజేశ్, హీరమాన్, తిరుపతి, శంకర్, బాలయ్య, ప్రకాశ్, విజయ్ పాల్గొన్నారు.

'ఇంటర్'కూ పీటీఎం

- హాజరు, ఉత్తీర్ణత పెంపునకు చర్యలు
- అమలుకు 'ఇంటర్' బోర్డు నిర్ణయం
- నెలలో నాలుగో శనివారం సమావేశం
- కసరత్తు ప్రారంభించిన అధికారులు



కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాల

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత శాతం పెంపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు (పీటీఎం) నిర్వహించేందుకు నిర్ణయించింది. ఇందుకోసం పక్కా ప్రణాళికలు రూపొందించింది. తరగతి గదిలో తమ పిల్లలు చదువుతున్న తీరు, ప్రవర్తన, హాజరు గురించి తల్లితండ్రులు తెలుసుకునే అవకాశముంది. అలాగే ఇంటి వద్ద విద్యార్థులు చదువుతున్నారా.. లేదా.? గైర్హాజరుకు కారణాల గురించి అధ్యాపకులు తల్లిదండ్రులను ఆరా తీసే అవకాశమేర్పడింది. ఇది విద్యార్థులు తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకుని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడనుంది. అంతిమంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు బలోపేతం కానున్నాయి. ప్రతీనెల నాలుగో శనివారం కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లతో సమావేశం నిర్వహించనున్నారు. ఇప్పటికే జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లకు ఆదేశాలు అందాయి.

జిల్లాలో 11 కళాశాలల్లో అమలు
జిల్లాలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో జనరల్ విద్యార్థులు 1,784 మంది, ఒకేషనల్ విద్యార్థులు 568 మంది విద్యనభ్యసిస్తున్నారు. చాలా కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం తక్కువగా ఉంది. ఇంటి నుంచి బయలుదేరిన విద్యార్థులు కొందరు కాలేజీ వరకు వెళ్లడం లేదు. ఇంటి వద్ద చదవకపోవడంతో వెనుకబడిపోతున్నారు. గతేడాది కొంత మెరుగ్గా ఉన్న ఫలితాలు అంతకుముందు చాలా తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడం ద్వారా ఈ సమస్య అధిగమించే అవకాశం ఉంటుందని ఇంటర్ బోర్డు భావిస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కళాశాలల్లో పీటీఎంలు నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

సమావేశంలో ఏం చర్చిస్తారంటే..
పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ గురించి ఆయా కళాశాలల అధ్యాపకులు ముందుగా ఫోన్ ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలి. సమావేశం నిర్వహించే తేదీ, సమయాన్ని తెలుపాలి. సమావేశంలో వారి పిల్లల సామర్థ్యాల గురించి అధ్యాపకులు వివరించాలి. వారు ఏ దశలో ఉన్నారో తెలుపాలి. ఏయే పాఠ్యాంశాల్లో వెనుకబడి ఉన్నారో చెప్పాలి. మెరుగైన ఫలితాలు సాధించాలంటే ఇంటి వద్ద కూడా చదివించాలని దిశానిర్దేశం చేయాలి. అలాగే తల్లిదండ్రులు కూడా కళాశాల నిర్వహణ గురించి సమావేశంలో తెలుసుకోవాలి. అధ్యాపకుల పనితీరును గమనించాలి. తద్వారా ఇరువైపులా విద్యార్థులపై శ్రద్ధ పెరిగి వారు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుంది.

హాజరు తగ్గుదలకు కారణాలు
జిల్లాలో ముఖ్యంగా ఏజెన్సీలోని పలు మండలాల్లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం చాలా తక్కువగా ఉంది. ఇందుకు అనేక కారణాలున్నాయి. రవాణా సౌకర్యం సరిగా లేకపోవడం, ఆర్టీసీ బస్సులు వేళకు రాకపోవడం లాంటి సమస్యలున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల నుంచి కాలేజీలకు వెళ్లే విద్యార్థులు చాలావరకు పేదకుటుంబాలవారే కావడంతో ప్రైవేట్ వాహనాల్లో వెళ్లే స్తోమత లేక తరచూ గైర్హాజరవుతుండడం గమనార్హం.

సమావేశాలు పక్కాగా నిర్వహిస్తాం



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లను పక్కాగా నిర్వహిస్తాం. త్వరలో కళాశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లతో సమావేశాలు ప్రారంభించనున్నాం. ఈ సమావేశాలతో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులు తెలుసుకునే వీలుంటుంది. ఇందులో భాగంగా అధ్యాపకులు చదువులో వెనుకబడిన వారిపై మరింత శ్రద్ధ పెట్టే అవకాశం కూడా ఉంది. హాజరు, ఉత్తీర్ణత శాతం పెంచేందుకు సమావేశాలు దోహదం చేస్తాయి.
– కళ్యాణి, డీఐఈవో

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సస్పెన్షన్

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని కొత్తసార్సాలలో 2019లో జరిగిన అటవీశాఖ అధికారుల దాడి కేసులో ఉద్యోగ నియమావళికి వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చినందుకు సెక్షన్ ఆఫీసర్ పీ ప్రసాద్‌రావును చీఫ్ కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్ట్ ప్రభాకర్ సస్పెండ్ చేశారు. 2019లో కొత్త సార్సాల గ్రామంలో ఫారెస్ట్ అధికారులపై కొంతమంది దాడి చేయగా మొదట పోలీసులకు ఒకరకమైన వాంగ్మూలం, ఆ తర్వాత కోర్టులో మరో రకమైన వాంగ్మూలం ఇవ్వడంతో ఉద్యోగ నియమావళికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పారని, నిబంధనలు వ్యతిరేకించినందుకు ఎఫ్‌ఎస్‌వో ప్రసాద్‌రావుపై సస్పెన్షన్ వేటువేశారు. ఇటీవల ఆదిలాబాద్ కోర్టులో కేసు విషయంలో విచారణ జరగగా అంతకుముందు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలానికి వ్యతిరేకంగా కోర్టులో జడ్జి ఎదుట మరో వాంగ్మూలం ఇచ్చారని, ఈ మేరకు నిబంధనల ప్రకారం సస్పెండ్ చేసినట్లు ప్రభాకర్ వెల్లడించారు. ప్రస్తుతం ప్రసాద్‌రావు సిర్పూర్(టి) మండలంలోని చింతకుంట సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఏదైనా కేసులో ప్రభుత్వ ఉద్యోగి పోలీసుల వద్ద ఇచ్చే 161 సీఆర్ పీసీ స్టేట్‌మెంట్‌కు విరుద్ధంగా ఇస్తే సీసీఏ రూల్స్‌కు వ్యతిరేకమని తెలిపారు. దీంతో కేసు తప్పుదోవ పట్టించే ప్రభుత్వ ఉద్యోగులు క్రమశిక్షణ చర్యలకు బాధ్యత వహించాల్సి వస్తుందని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు



ప్రమాదానికి గురైన ఇల్లు

జన్నారం: మండల కేంద్రంలోని ధర్మారం రోడ్డులో సతీశ్‌గౌడ్ ఇంట్లో శనివారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఏసీ దగ్ధం కాగా, మంచం, బీరువాలో బట్టలు, సామగ్రి, డబ్బులు కాలిపోయాయి. సమాచారం అందగానే ఫైర్ సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు ఇన్‌చార్జి ఫైర్ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు.

వృద్ధుడికి ఆశ్రయం

పాతమంచిర్యాల: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం బోడేపల్లిలో వృద్ధుడు నడవలేని స్థితిలో ఉన్నాడు. ఈ విషయాన్ని స్థానికులు ఎస్సై విక్రమ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన.. ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌కు చేరవేశాడు. దీంతో పోలీసులు మంచిర్యాలలోని కల్వరీ యువశక్తి అనాథాశ్రమ నిర్వాహకుడు ములుకాల కుమార్‌కు సమాచారమిచ్చారు. పోలీసులు సదరు వృద్ధుడిని శనివారం కల్వరీ యువశక్తి అనాథాశ్రమానికి తరలించి ఆశ్రయం కల్పించారు.

మూగజీవాలను కాపాడిన హెడ్‌కానిస్టేబుల్



మూగజీవాలతో హెడ్ కానిస్టేబుల్ జంగు

రామకృష్ణాపూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలోని కార్మిక వాడలకు భారీగా వరద నీరు చేరింది. ఆర్‌కే1 ఏరియా శివారులో పాలవాగుకు ఆనుకుని ఉన్న ఓ వ్యవసాయ భూమిలో పశువుల కోసం ఏర్పాటు చేసిన కొట్టం వరద నీటిలో మునిగిపోతుండగా ఆవుల ఆర్తనాదం విన్నవారు శనివారం పోలీసులకు సమాచారమిచ్చారు. పట్టణ ఎస్సై రాజశేఖర్ వెంటనే స్పందించి హెడ్ కానిస్టేబుల్ జంగును పంపించాడు. వరద ఉధృతిలో ప్రాణాలకు తెగించి ఒక కర్ర సహాయంతో ఈదుకుంటూ వెళ్లి మూగజీవాలను రక్షించాడు. హెడ్ కానిస్టేబుల్‌ను ఎస్సై, సీఐ శశిధర్‌రెడ్డితోపాటు పలువురు ఉన్నతాధికారులు అభినందించారు.

కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు

ఉట్నూర్‌రూరల్: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని దంతన్‌పల్లి సమీపంలో భారీ చెట్టు కూలింది. శనివారం తెల్లవారు జామున ఉట్నూర్ వైపు నుంచి జన్నారం వైపు కారులో ఓ కుటుంబం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రైవర్ ఒక్కసారిగా కారు ఆపడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది.

గిరిజనేతరుల చేతిలో వేల ఎకరాలు

- అటవీ భూముల ఆక్రమణలో ఎస్సీ, బీసీలు
- స్వాధీనానికి అటవీ శాఖ యత్నం
- హక్కులు కల్పించాలంటూ డిమాండ్లు



ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం దిందాలో సాగులో ఉన్న అటవీ భూమి(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అటవీ భూములు సాగు చేస్తున్న వేలాది గిరిజనేతరులు తమకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా బీసీ, ఎస్సీలు అటవీ భూముల ఆధారంగానే జీవిస్తూ సాగు చేసుకుంటున్నారు. గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్(అటవీ హక్కుల గుర్తింపు) కింద పట్టాలు ఇచ్చారు. కానీ గిరిజనేతరులకు అవకాశం లేదు. దీంతో ఏటా సీజన్‌లో ఆ భూముల్లో విత్తనాలు వేసే సమయంలో ఆక్రమణదారులు, అటవీ అధికారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని చోట్ల తిరిగి స్వాధీనం చేసుకుని మొక్కలు నాటుతున్నారు. తాజాగా ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం దిందా గ్రామస్తులను అటవీ అధికారులు సాగు చేసుకోకుండా అడ్డుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు పాదయాత్ర చేపట్టగా, మధ్యలోనే పోలీసులు అడ్డుకుని తీసుకొచ్చారు.

బీసీ, ఎస్సీలు అధికం

అటవీ భూములను గిరిజనులతోపాటు బీసీ, ఎస్సీ ఇతర వర్గాలు వేలాది మంది సాగు చేస్తున్నారు. వీరికి సైతం పట్టాలు ఇవ్వాలని డిమాండ్లు వచ్చినప్పటికీ ప్రభుత్వం పక్కన పెట్టింది. మూడేళ్ల క్రితం రాష్ట్రవ్యాప్తంగా 1.50లక్షల మంది గిరిజన రైతులకు 4.05లక్షల ఎకరాల్లో హక్కులు కల్పించారు. చట్టం ప్రకారం గిరిజనులకు మాత్రమే హక్కులు ఉన్నాయి. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాల్లోనూ గిరిజనేతరులు సాగులో ఉన్నారు. రిజర్వు ఫారెస్టుతోపాటు పులుల సంరక్షణ కేంద్రమైన కవ్వాల్ పరిధిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంకా 1.29లక్షల ఎకరాలు ఆక్రమణలో ఉంది. గిరిజనేతరులతోపాటు కొన్ని చోట్ల గిరిజనులు సైతం కొత్తగా ఆక్రమణలకు పాల్పడుతుండడంతో అడవుల సంరక్షణ మరింత ఇబ్బందిగా మారిందని అధికారులు వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే..

నిజాం కాలం నుంచే అటవీ ఆక్రమణలు ఉన్నప్పటికీ గత 20ఏళ్లలో ఈ ఆక్రమణలు తీవ్రంగా పెరిగాయి. పత్తి సాగు మొదలైనప్పటి నుంచి గిరిజనులతోపాటు గిరిజనేతరులు సైతం పెద్ద ఎత్తున చెట్లను నరికి సాగులోకి వచ్చారు. ఆ సమయంలో కొంతమంది సిబ్బంది అవినీతితో ఇష్టారీతిన ఆక్రమణలు జరిగాయి. మరికొన్ని చోట్ల రాజకీయ ఒత్తిళ్లు, అధికారుల నిర్లక్ష్యం, తదితర కారణాలతోనూ రిజర్వు ఫారెస్టుల్లో సాగు మొదలైంది. ఆ భూములే తిరిగి స్వాధీనం చేసుకోవాలంటే సామాజిక సమస్యగా మారింది.

దిందాలో ఒక్కొక్కరు 40ఎకరాల వరకు..

ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం బందెపల్లి, దిందాలో పరిధిలో ఒక్కో కుటుంబం ఎకరం నుంచి 42ఎకరాల వరకు ఆక్రమించారు. ఇందులో పది నుంచి 30ఎకరాల వరకు సాగులో ఉన్నారు. ఇక్కడ 530ఎకరాల్లో గిరిజనులకు పట్టాలు ఇచ్చారు. రిజర్వు ఫారెస్టులో 2600ఎకరాలు ఆక్రమణలో ఉంది. అయితే 600ఎకరాలను సాగుదారులకు వదిలేశారు. మిగతాది గిరిజనేతరుల నుంచి స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తుండగా వివాదం రాజుకుంటోంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



ఎర్రవాగును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మనోజ్

నెన్నెల: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలు దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో జలమయమైన ప్రాంతాలు, వాగులను శనివారం పరిశీలించారు. సుంకరివాడలోని నారాయణ, పురంశెట్టి రాకేశ్ ఇళ్లలోకి చేరిన వర్షపు నీటిని తొలగించాలని ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి సురేశ్‌ను ఆదేశించారు. ఇళ్లలో నిలిచిన నీరు బయటకు వెళ్లేలా నూతనంగా వేసిన సీసీ రోడ్డు పక్క నుంచి కాలువ తీయాలని, నీళ్ల వెళ్లేందుకు అడ్డంగా ఉన్న మెట్లు తొలగించాలని సూచించారు. తహసీల్దార్, మండల పరిషత్, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించే ఏర్పాట్లు చేయాలన్నారు. కొత్తగూడంలో ఏర్పడిన కుమ్మరివాగు ప్రాజెక్టు ఎడమ కాల్వ గండిని సందర్శించి వెంటనే ఇసుక బస్తాలతో పూడ్చాలని ఇరిగేషన్ ఏఈని ఫోన్‌లో ఆదేశించారు. లంబాడితండా ఎర్రవాగును సందర్శించి పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో అబ్దుల్‌హై, ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

చిరుత సంచారం



పాదముద్ర సేకరిస్తున్న అటవీ అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని సార్సాల పరిసరాల్లో చిరుత సంచరించింది. శుక్రవారం రాత్రి బూరం పోచన్నకు చెందిన గేదె దూడపై దాడి చేసి హతమార్చింది. అదే ప్రాంతంలో కుక్కపై దాడి చేసి చంపింది. శనివారం తెల్లవారు జాము ఓ మహిళకు చెందిన పశువులపై దాడికి యత్నించడంతో అవి తప్పించుకున్నాయని గ్రామస్తులు తెలిపారు. శనివారం ఫారెస్ట్ సెక్షన్ అధికారి సుభాన్, బీట్ అధికారి శ్రీవాణి, సిబ్బందితో సందర్శించి చిరుత పాదముద్రలను సేకరించారు. తక్షణ సహాయం కింద గేదె దూడ యజమానికి రూ.5 వేల పరిహారం అందజేశారు. చిరుతపులి సంచారంపై డప్పు చాటింపు చేశారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

రెబ్బెన: గోలేటిలో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించే అంతర్ జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి పేర్కొన్నారు. గోలేటి టౌన్ షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా పురుషులు, మహిళల క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. సుమారు 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 17 నుంచి 21 వరకు సింగరేణి క్రీడామైదానంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందులో ప్రతిభ చూపినవారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి, భాస్కర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు చందర్ ఏఐటీయూసీ నాయకులు జగ్గయ్య, క్రీడాకారుడు నరేశ్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరానికి ఎంపిక

ఉమ్మడి జిల్లా పురుషుల జట్టుకు కె.సిద్దార్థ్, ఎం.తిరుపతి, పి.పవన్‌కుమార్, కె. తరుణ్, జి.గోపాల్, పి.శ్రీకాంత్, సాయి చరణ్, టి.దిలీప్‌కుమార్, పి.దేవరాజ్, ఎం.సూర్యకుమార్, ప్రేంకుమార్, సీహెచ్ గోపాలకృష్ణ, సీహెచ్ వరణ్ ఎంపికయ్యారు. మహిళల జట్టుకు ఏ.స్వప్న, కె.అంజలి, డి.శ్రావణి, జి.అనూష, కె.శ్రీస్ఫూర్తి కారుణ్య, టి.ప్రజ్వల శ్రీ, పి.వర్షిణి, సుజాత, సాయిదీక్ష, సంజన, అర్చన, వైష్ణవి, హారిక ఎంపికయ్యారు.

క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి

- బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరిశంకర్
- ప్రారంభమైన రాష్ట్రస్థాయి పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న హరిశంకర్

ఆదిలాబాద్: క్రీడాకారులంతా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్లా హరిశంకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో తెలంగాణ 5వ సీనియర్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ చాంపియన్‌షిప్ (మహిళలు–పురుషులు) పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటిని సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడాభివృద్ధికి ఎంతగానో పాటుపడుతున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పది రోజుల పాటు శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని వివరించారు. పోటీల్లో రాష్ట్ర జట్టు విజేతగా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.శ్వేత మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతోమంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించినవారికి గొప్ప భవిష్యత్తు ఉంటుందన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కలాల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం శుభపరిణామన్నారు. 33 జిల్లాల నుంచి సుమారు 700 క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి డా.కృష్ణ, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి జ్యోతి, ఉపాధ్యక్షుడు లోక ప్రవీణ్‌రెడ్డి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు, వ్యాయామ ఉపాధ్యాయులు దయానందరెడ్డి, హరిచరణ్, రామ్‌కుమార్, జిల్లాల నుంచి కార్యదర్శులు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు

పురుషుల విభాగంలో ఆదిలాబాద్ కరీంనగర్ జట్టుపై 6–1తో, హైదరాబాద్ నిర్మల్ జట్టుపై 7–1తో, మహబూబ్‌నగర్ సిద్దిపేట జట్టుపై 7–2తో విజేతలుగా నిలిచాయి. మహిళల విభాగంలో నిజామాబాద్ జట్టు సిద్దిపేటపై 9–0తో, కరీంనగర్ జట్టు మహబూబాబాద్ జట్టుపై 6–5తో, నల్గొండ జట్టు ఆసిఫాబాద్ జట్టుపై 7–4తో విజేతలుగా నిలిచాయి.

గర్భిణుల తరలింపు



అంబులెన్స్‌లో తరలిస్తున్న వైద్యసిబ్బంది

వేమనపల్లి: భారీ వర్షాలు దృష్ట్యా శనివారం వేమనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో లోతట్టు గ్రామాల్లోని గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కళ్లెంపల్లి, జాజులపేట, సుంపుటం గ్రామాలకు చెందిన భారతి, శకుంతల, రోజును వేమనపల్లి పీహెచ్‌సీ నుంచి అంబులెన్స్‌లో చెన్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇన్‌చార్జి హెల్త్ సూపర్‌వైజర్ రాంశెట్టి బాపు, ఏఎన్ఎం మంజుల, రాజ్యలక్ష్మి, ఈఎంటీ జనార్దన్, పైలెట్ సంపత్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన ఇద్దరిపై కేసు

జన్నారం: కులం పేరుతో దూషించిన ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపారు. ఆమె కథనం ప్రకారం ..లక్సెట్టిపేట మండలం ఎల్లారం గ్రామానికి చెందిన రామంటెంకి శ్రీనివాస్‌కు జన్నారం మండలం రేండ్లగూడ శివారులోని సర్వేనంబర్ 158/4లో ఎకరం పొలం ఉంది. రేండ్లగూడకు చెందిన బాల్త రాజమౌళి ఈ పొలాన్ని దున్నించాడు. ఈనెల 13న రామటెంకి శ్రీనివాస్, తండ్రి రాజలింగుతో కలిసి అక్కడికి వెళ్లి తిరిగివస్తున్నారు. పాతకక్షలు మనస్సులో పెట్టుకుని బాల్త రాజమౌళి, బాల్త భూమక్కలు శ్రీనివాస్, రాజలింగును కులం పేరుతో దూషించారు. శ్రీనివాస్ ఫిర్యాదుతో శనివారం ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గాండ్ల సాయినాథ్ (40) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. సాయినాథ్‌కు గత 20 ఏళ్ల క్రితం రజితతో వివాహమైంది. ఇప్పటివరకు సంతానం కాలేదు. దివ్యాంగుడు కాగా, మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి అశోక్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మతిస్థిమితంలేని వృద్ధుడు

సిర్పూర్(టి): మండలంలోని నవేగాం గ్రామానికి చెందిన రాంటెంకి రుషి(60) శుక్రవారం పెన్‌గంగ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం.. రుషి గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడు. శుక్రవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. దహెగాం మండలకేంద్రం శివారులో పత్తి చేనులో అతని బట్టలు దొరకగా శనివారం ఉదయం పెన్‌గంగ నదిలో మృతదేహం ఆచూకీ లభ్యమైంది. మృతుడి పెద్దనాన్న కుమార్తె యశోదాబాయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అడవిపంది దాడిలో వ్యక్తి మృతి

భీమిని: అడవిపంది దాడిలో వ్యక్తి మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కన్నెపల్లి ఎస్సై భాస్కర్‌రావు, స్థానికులు తెలిపిన వివరాలు.. భీమిని మండలం వెంకటపూర్‌కు చెందిన దాగామ రామయ్య (70) కన్నెపల్లి మండలం సుర్జాపూర్ శివారులో శనివారం పత్తి చేనుకు వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో అడవి పంది దాడిలో అతడు గాయపడ్డాడు. పక్క చేనులో ఉన్న రైతులు గట్టిగా కేకలు వేయగా అది పరిగెత్తింది. రామయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. అక్కడి నుంచి వెళ్లిన అడవి పంది గురుండ్ల చిరంజీవి, మేకల బాపులపై దాడి చేసి గాయపర్చింది. ఫారెస్ట్ అధికారులు సిబ్బంది, మరికొందరితో కలసి పట్టుకునేందుకు వెళ్లగా అందులో ఒకరిని గాయపర్చినట్లు తెలిసింది. మృతుడి కుమారుడు రాజేశం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'కనకాయి'.. పరవళ్లు



బజార్‌హత్నూర్ మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు కడెం, బంద్రేవ్, బోస్రా వాగుల్లో వరద నీరు పోటెత్తింది. కడెం నదిపై గల కనకాయి జలపాతం పరవళ్లు తొక్కింది. వీటిని తిలకించేందుకు పర్యాటకులు తరలివచ్చారు. ఇక్కడ పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. – బజార్‌హత్నూర్


ఎస్సారెస్పీకి పోటెత్తిన వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ

ఎస్సారెస్పీ ఎగువన మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద పోటెత్తింది. శనివారం 1.04 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు ప్రస్తుతం 1083 అడుగులు ఉంది. 80.5 టీఎంసీలకుగాను 53.62 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్ట్ నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని కాకతీయ కాలువ, మిషన్ భగీరథకు వదులుతున్నారు. గోదావరిలో భారీగా వరద నీరు చేరే అవకాశం ఉన్నందున పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ అధికారులు సూచించారు. పశువుల, గొర్రెల కాపర్లు, చేపలు పట్టేవారు, రైతులు గోదావరి నదిని దాటే ప్రయత్నం చేయొద్దని పేర్కొన్నారు. – మామడ

'పొచ్చెర' ఉరకలు



అలుగు పారుతున్న కరత్వాడ ప్రాజెక్టు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పొచ్చెర జలపాతం ఉరకలెత్తింది. శనివారం భారీ వరద నీరు చేరడంతో జలపాతం నిండుకుండలా మారింది. కరత్వాడ ప్రాజెక్టు నిండిపోవడంతో అలుగు పారింది. ప్రాజెక్టును చూడటానికి సందర్శకులు తరలివచ్చారు. పొచ్చెర జలపాతం అందాలు చూసేందుకు అటవీ అధికారులు అనుమతి ఇవ్వలేదు. – బోథ్



ఉరకలెత్తుతున్న పొచ్చెర జలపాతం

కడెం వరదలో వ్యక్తి గల్లంతు

- చేపల కోసం కడెం గేట్ల కిందకు వెళ్లి..
- ప్రవాహం పెరిగి, నీటిలో కొట్టుకుపోయి
- రాత్రివేళ గాలింపు నిలిపివేత



పాండ్వపూర్ బ్రిడ్జి వద్ద కొట్టుకువస్తున్న గంగాధర్

కడెం/దస్తురాబాద్: చేపల వేటకు వెళ్లి కడెం వరదలో చిక్కుకుని ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. కడెం మండలం కన్నాపూర్‌కు చెందిన తిప్పిరెడ్డి గంగాధర్ (45) శనివారం కడెం గేట్లు ఎత్తడంతో కుమారుడు, మరో వ్యక్తితో కలిసి ప్రాజెక్ట్ గేట్ల దిగువన వెళ్లాడు. రెండు గేట్లు మూసివేయడంతో నీటి ప్రవాహం తగ్గిందని కర్రలతో చేపలు వేటాడేందుకు వెళ్లాడు. అరగంట తర్వాత ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు సైరన్ మోగించి మరో రెండు గేట్లు ఎత్తారు. సమీపంలో వందలాది మంది కేకలు వేసిన గంగాధర్ ఫోన్ చూస్తుండగా ఒక్కసారిగా చుట్టూ నీళ్లు చేరాయి. బయటకు రాలేక, కొద్ది దూరంలో బండపై నిల్చొని కాపాడండి అంటూ కేకలు వేశాడు. వరద ప్రవాహం పెరగడంతో అందరు చూస్తుండగానే నీటిలో కొట్టుకుపోయాడు. 3 కి.మీ మేర మునుగుతూ, తేలుతూ ఈదుతున్నాడు. పాండ్వపూర్ సమీపంలో కడెం వంతెనను దాటి వెళ్లడం అక్కడే ఉన్నవారు, కానిస్టేబుళ్లు నాగరాజు, వంశీ గమనించారు. చెట్లపొదల పక్క నుంచి కొట్టుకుపోతున్న అతన్ని కాపాడేందుకు పరిగెత్తి ప్రయత్నించారు. సుమారు 3 కి.మీ మేర బురదలో వెళ్లిన ఫలితం దక్కలేదు. అదేవిధంగా దస్తురాబాద్ మండలం భూత్కూర్ పంచాయతీ రాంపూర్ గోదావరి తీర ప్రాంతంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చేపట్టింది. ఎస్సై సాయికుమార్, తహసీల్దార్ విశ్వంబర్ అక్కడికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ దొరకకపోవడం, రాత్రి కావడం, వరద ప్రవాహం పెరగడంతో గాలింపును నిలిపివేశారు. కడెం ప్రాజెక్ట్ వద్ద ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందం స్పందిస్తే వరదల్లో గంగాధర్‌ను బయటకు తీసుకువచ్చేవారని స్థానికులు వాపోయారు. గంగాధర్‌కు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఉపాధి నిమిత్తం బిస్కెట్లు, కేక్‌లు, చాక్లెట్లు తదితర బేకరీ ఐటెమ్స్‌ను షాపులకు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు.



తిప్పిరెడ్డి గంగాధర్ (ఫైల్)

కేకలు వేశాం

కడెం గేట్లు దూరాన ఉన్న మేము బయటకు రావాలని కేకలు వేశాం. అతను గమనించలేదు. నేను పోతున్నా అంటూ గట్టిగా అరిచాడు. 20 నిమిషాల వ్యవధిలో వరదలో కొట్టుకుపోయాడు. – వినయ్, ప్రత్యక్ష సాక్షి

ప్రయాణికులను కాపాడిన సీఐ



రక్షించిన ప్రయాణికులతో సీఐ సాయిరమణ

ఖానాపురం: వరద నీటిలో చిక్కుకున్న ఓ కుటుంబాన్ని వరంగల్ జిల్లా దుగ్గొండి సీఐ సాయిరమణ కాపాడారు. వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లాకు చెందిన బాస లక్ష్మీనారాయణ, అన్నపూర్ణ, రితిక, రితిన్ భద్రాచలానికి కారులో వెళ్తున్నారు. ఖానాపురం మండలంలోని చిలుకమ్మనగర్–కొత్తగూడ మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటిలో చిక్కుకుపోయారు. వెంటనే లక్ష్మీనారాయణ పోలీసులకు సమాచారం అందించారు. డీజీ కంట్రోల్ కార్యాలయం నుంచి స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో సీఐ సాయిరమణ శనివారం తెల్లవారు జామున 3 గంటలకు చిలుకమ్మనగర్‌కు చేరుకుని గ్రామస్తుల సహకారంతో వారిని క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. సదరు కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.